"ఆ గండం గడిచిన నా స్వానుభవం అంతా ముందే ట్టుకుని, మృత్యుగహ్వారం నుంచి బయటపడ్డ నేను మిమ్మల్నొ కటే అడుగదల్చుకున్నాను"

"ఏమిటదీ?"

"మీరు లైఫ్ ఇన్సూర్ చేశారా?"

"లేదు"

"అయితే వెంటనే చెయ్యండి. నేను స్వార్థంకోసం కాదు చెప్పేది. అంతా నిష్కామకర్మ- భగవద్గీతలో చెప్పి నట్టు. ఈ రోజుల్లో జీవితాలు శాశ్వతం కావు. బయటికి వెళ్ళినవాడు ఇంటికి వచ్చే వరకూ నమ్మకం లేదు. అందుకే నామాట వినండి"

కమలాకర్ కి ఇప్పటికి కథ అర్థమైంది. వెంటనే రగ్గు కప్పుకుని నిద్ర నటించ సాగాడు. ★

## గింజలు మిగిలాయి!

దాలయ్య ఫాక్టరీ నించి వొచ్చి, తీనెమీద కూచు న్నాడు. పక్కింటి ముసలమ్మ తాళాలు తీసుకొచ్చి ఇచ్చింది, ఇతను రావడం పసిగట్టి.

"అదేదీ?" అన్నాడు దాలయ్య.

"ఏమో, నాతో సెప్పింది కాదు" అంది ముసలమ్మ.

దాలయ్య తలుపు తీసుకొని, బుడ్డి వెలిగించాడు. ఆ మినుకు మినుకు మనే దీపం సాధ్యమైనంత వరకూ చీకటిని తరిమి వేస్తోంది. వస్తువులన్నీ ఎక్కడి వక్కడే వున్నాయి.

అదేమైందో తెలీదు. ఎవ్వరితోనూ చెప్పనట్టుంది. అదే వొస్తుందనే నమ్మకంతో దాలయ్యా తన పనులన్నీ చేసుకుంటు న్నాడు. దూరంగా బారెడు మేరలో వున్న ఒరల నుయ్యికి చాద తీసుకుని బయలు దేరాడు.

చన్నీళ్ళ స్నానం, పొద్దున్న నించీ, ఎంతో శ్రమపడ్డ అతనికి కొంత మనశ్శాంతి నిస్తోంది. అంతసేపూ ఏవో ఆలోచ నలు మెదడులో పరుగెడుతున్నాయి 'ఎప్పుడూ ఇట్లా చేసేది కాదు. ఈ వేళ ఏమొచ్చిందని? ఎవరన్నా చుట్టాలూ పక్కా లూ వున్నారేమో- అదీ కనపడదు.

పోనీ స్నేహాలు...అవి అసలే లేవు. ఎవళ్ళతోనూ పదినిమిషాలకంటె ఎక్కువసేపు మాట్లాడేది కాదు. ఏమన్నా అంటే తను, "వొత్తి సొద! పిత్తోళ్లతోనూ మాటాడ్డానికి ఏటుంది?" అనేది.

ఆకలి తీర్చుకుందుకు దాలయ్యా ముంతలు వెదుకు తున్నాడు. కాస్త గంజి, వరి అన్నం వుంది ఓమూల- తనొ క్కడికే సరిపోయేంత

'అదేమాతుంది? తిండికూడా తినదేటి?' అనుకున్నాడు.

మాడుతూన్న కడుపు మళ్ళీ ఆ మాట జ్ఞాపకానికి రాకండా చేసింది. అంచేత తనకి కావాల్సిందంతా తడుము కోకండా తినేశాడు.

ముంతలు మామూలుచోటుంచి- వీధిలో నులక మంచం వేశాడు, గుడిసె కెదురుగా.

తక్కిన గుడిసెల్లో మనుషులు తమ తమ సొంత గోడ వల్లో పడున్నారు. కొందరు అలసిపోయిన తమ భర్తలకి సేద

దీరుస్తున్నారు. కొంతమంది తమ పిల్లలకి అన్నం తినిపిస్తున్నారు. మరికొందరు, కి ర స నా లు కరువు వల్ల ముందరగానే అన్నాలు తిని- వీధిలో వేసవి కాలపు రాత్రి చల్లని గాలికి చేరారు.

దాలయ్య రావడం చూసిన కొందరు, తీరుబడి వున్న వాళ్ళు, అక్కడికి కొస్తున్నారు. దాలయ్యకి ఎందుకో మొదట అర్థం కాలేదు. కాని క్రమంగా వాళ్ళ మాటలు తను- ఫాక్టరీలో వుండగా జరిగిన సంఘటనని తెలిచేస్తున్నాయి.

"దానింట వాన గురవ! పాపం, నిన్నిట్టా జేసి..."

ఓ ముసలమ్మ పరామర్శ చేస్తోంది. ఆమె వెనకాలే ముసిముసి నవ్వులు నవ్వుతోన్న పడుచులు- 'అది గనక అంత నీ చ కా ర్యం చేసింది; మేమెంత మంచి వాళ్లమో చూసుకో!' అన్నట్టు చూస్తున్నారు.

ఈపాటికి దాలయ్యకి అదేమైందో అర్థమైంది. పరామర్శ అవగానే వొచ్చిన వాళ్ళు మెల్లిగా జారుతున్నారు.

దాలయ్య ఆలోచనలో పడ్డాడు. తనేం లోటు చేశాడని? దాని కోసరమే కదా ఇంత చెమటోడుస్తుంట. పోనీ ఇష్టం లేదని ఏ క్షణంలోనన్నా చెప్పలేదే. అనుమానాన్నికైనా తావివ్వ లేదు, ఈ ఎనిమిదేళ్ల స్నేహం లోనూ. చివరికి వెళ్ళే టప్పుడు కూడా, తను ఏం కష్టపడతాడోనని, గంజి కాచి, తాళాలు ఎవరికో యిచ్చి వెళ్ళి పోయింది. నిజంగా యిష్టం లేని వాళ్ళెవరేనా ఇట్లా చేస్తారా? ఇ ష్టం లే ద ని, ముక్కల కింద కోసినా, అనుకోగలగడం అసంభవం.

మరి, ఎందుకు లేచిపోయింది? దానికే, ఎంత ఆలో

చించినా సమాధానం రావడం లేదు.

తనకంటె ఆకర్షవంతమైన, ఎక్కువ సౌఖ్యాలు ఇచ్చే...అదే ఐ వుండాలి. కాని ఇట్లా అనుకుందుకూ సరైన ఆధారం లేదు. ఎందుకంటే తను ప్రస్తుతం జీవిస్తున్న పద్ధతితో విసిగినట్టు, ఒక్క పిసరైనా తెలపలేదు, కొత్తదారులు తొక్కుదామనుకుందుకు.

దాలయ్యకి, అది లేచిపోయినందుకు విచార మెయ్య లేదు గాని యింత తెలియ జెప్పకుండా పోవడమేమా? అని విచారంగా వుంది. అంత యిష్టం లేకపోతే తను బలవంతం చేస్తే మాత్రం ఏం సుఖంగా వుంటుంది ఆ కాపరం.

ఏదీ తేలలేదు.

చీకటిలో ఏదో మనిషి నీడలా తన వైపు ఒస్తోంది. అదేమో ననుకున్నాడు.

"ఎక్కడికెళ్ళావ్?" అన్నాడు ఆత్రింతో.

వొచ్చే మనిషి కంఠం సవిరించింది. క్రిమంగా మొగాడని స్పష్ట పడింది.

దాలయ్య నాలికకొరుక్కొని "ఎవరారు?" అన్నాడు.

"నేనా్రి! సేషిగాడ్ని"

సేషయ్య వొచ్చి పక్కగా బండరాయి మీద కూచున్నాడు.

"ఏం విచారంగా వుందా?" అన్నాడు ఓదార్పుకి.

"అసలు జరిగిందేటి? సరిగ్గా చెప్పు" అన్నాడు దాలయ్య– అంతా తెల్సుకుందామని.

సేషయ్య కొంచెం దగ్గర స్నేహితుడు. డబ్బు నిల

వున్నవాడు. ఓ సొంత జట్కా ఉంది. దాన్ని తోలుకుని స్వతంత్రంగా బతుకుతున్నాడు.

"పట్నంలో కారు స్టాండ్ దగ్గర కనపడ్డాది. మన మెకానిక్ లేడూ, అతగాడు పక్కనున్నాడు. నేను ఎక్కణ్నించో బండి తోలుకొస్తున్నాను. ఇక్కడుండేవిటా? అని ఆశ్చర్యమేసింది! కాని ఏమని అడగడానికీ భయమేసింది.

"అక్కడికీ అడిగాను 'ఇదేమిటే?' అని. మెకానిక్ టికట్టు తీసుకుందుకు కారు దగ్గర కెళ్ళాడు.

" 'ఆయనతో పోతున్నాను ఆయనకూడా నన్ను పిలిచాడు. మాకు మనసు కుదిరింది.' ఇక్కడ కొంత సేపు ఆగి మళ్ళీ అందుకుంది. 'వాడంటే ఇష్టం లేదని కాదు; పిచ్చి మనసుండ బట్టలేక పోయింది. యిట్టా చేశానని కోప్పడొద్దను. ఎప్పటికీ మరిసిపోనని సెప్పు' అంది.

"ఇది నీకు చెబుదామనే వచ్చాను."

అంతా చెప్పి- దాలయ్య- ఏం పెద్ద షాక్ తింటాడో నని— మొఖంకేసి దీక్షగా చూస్తున్నాడు సేషయ్య.

పక్క గుడిసెల వాళ్ల సద్దు మణిగింది. పక్షులు చెట్ల మాటు నుండి రొద జేస్తున్నాయి. కీచురాళ్ల కూతలు కూడా ఎక్కువగానే వున్నాయి. ఏ చెట్టూ లేనిచోట ఆముదపు చెట్టే మహా వృక్షమైనట్టు, సూర్యుడూ చంద్రుడూ లేని ఆకాశానికి అధినాథుల్లా నక్షత్రాలు మెరుస్తున్నాయి.

సేషయ్య చెప్పిందంతా దాలయ్య శాంతంగా విన్నాడు. అంతా విని చివరికి ఓ నిట్టూర్పు విడిచాడు. అతనేం మాట్లాడనందుకు ఆశ్చర్య మేసింది సేషయ్యకి.

తన స్త్రీయే ఇట్లా చేస్తేనా? తక్షణం వెళ్ళి దాని ప్రాణమైనా తీసేవాడు, తనైనా చచ్చేవాడు. అంతేకాని దాలయ్య పౌరుషం లేనట్టు ఇదేమిటి?

సేషయ్యకి పాలుపోలేదు.

దాలయ్య ఇంటిచూరు తాటాకు పీకి, పళ్లతో ముక్కల కింద కొరికి అవతల పారేస్తున్నాడు. మళ్ళీ కాసేపు తల గోక్కుంటున్నాడు. లోపల ఏ మాలోచిస్తున్నాడో, ఏ నిర్ణయాలకి వొచ్చాడోగాని, పైకి గంభీరంగా కనపడుతున్నాడు. ఆరాటపడ్డ మనస్సు ధీరోదాత్తంగా శాంతం వహించింది.

"ఏమంటావ్?" అన్నాడు సేషయ్య, వెళ్ళిపోవడానికి లేస్తూ.

దాలయ్య ఆకాశంలో నక్షత్రాల్ని పిచ్చిగా లెక్కబెడుతూ అన్నాడు:

"అనడానికేముంది? ఈ కరువు రోజుల్లో 'గింజలు మిగిలాయి' అంటానంతే!" ★

## "వివాహిత"

ఏనాడూ లేంది ఆ వేళ ఉదయాన్నే కృష్ణప్రసాదు గత రోజు ఆంధ్రపత్రిక కొన్నాడు, హోటల్ నుంచి తిరిగొస్తూ.

ఏవో కొన్ని వార్తల్ని చదివాడు. తర్వాత రకరకాల ప్రకటనలు అతని దృష్టిపథాన్నాకర్షించకుండా వుండలేక పోయాయి. అందులో ముఖ్యమైంది నర్సాపూర్ వితంతు శరణాలయంవారి ప్రకటన.